

లైసెన్స్‌కార్డుల కటకట
ఏడాదైనా లైసెన్సు కార్డులు అందక వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు.
వివరాలు 8లో ▸



కరాటేలో ప్రతిభ
అంతర్జాతీయ కరాటే పోటీల్లో చేర్యాల విద్యార్థులు ప్రతిభ కనబర్చినట్లు ఫెడరేషన్ రాష్ట్ర టీం కోచ్ సెన్సాయి ఎంఎస్.పాషా తెలిపారు.
వివరాలు 8లో ▸



సమన్వయంతో సాగుదాం
సమస్యల పరిష్కారానికి సమష్టిగా సమన్వయంతో సాగాలని మున్సిపల్ చైర్ పర్సన్ మంజుల సూచించారు.
వివరాలు 9లో ▸

న్యూస్‌రీల్

తపాస్‌పల్లి రిజర్వాయర్‌కు పూజలు



తపాస్‌పల్లి రిజర్వాయర్‌కు ప్రత్యేక పూజలు చేస్తున్న కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి


కొమురవెల్లి(సిద్దిపేట): తపాస్‌పల్లి రిజర్వాయర్‌కు మంగళవారం జనగామ డీసీసీ అధ్యక్షుడు కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి మండల నాయకులు, కార్యకర్తలతో కలిసి ప్రత్యేక పూజలను నిర్వహించారు. మంగళవారం ఆయన మాట్లాడారు. నియోజకవర్గ రైతులు సంతోషంగా ఉండాలన్నారు. నియోజకవర్గంలోని అన్ని ప్రాజెక్టుల్లో గోదావరి జలాలు నింపుతున్నట్లు తెలిపారు. గతంలో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రాజెక్టుల నిర్మాణాలు చేపడితే బీఆర్ఎస్ ప్రభుత్వం తపాస్‌పల్లి రిజర్వాయర్ నుంచి సిద్దిపేటకు నీటిని తరలించారని ఆరోపించారు. కాంగ్రెస్ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను తప్పకుండా అమలు చేస్తోందన్నారు.తపాస్‌పల్లి రిజర్వాయర్‌లోకి రెండు రోజుల క్రితం నుంచి గోదావరి జలాలను అధికారులు పంపింగ్ చేస్తుండటం తెలిసిందే. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు మహాదేవుని శ్రీనివాస్, పీఏసీఎస్ చైర్మన్ మెరుగు కృష్ణ, ప్రధాన కార్యదర్శి సనాది భాస్కర్, అయినాపూర్ మాజీ సర్పంచ్ చెరుకు రమణారెడ్డి పాల్గొన్నారు.

విద్యుత్ సరఫరాలో అంతరాయం



ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): పట్టణంలోని 11 కేవీ మైత్రివనం ఫీడర్‌ల మరమ్మతుల కారణంగా శుక్రవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని పట్టణ అసిస్టెంట్ డివిజనల్ ఇంజినీర్ సుధాకర్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. రాజేంద్రనగర్, విఘ్నేశ్వరనగర్, మైత్రివనం, ఆదర్శనగర్, కాకతీయ నగర్, మహాశక్తినగర్ పరిసర ప్రాంతాల్లో మధ్యాహ్నం 3 నుంచి సాయంత్రం 5 గంటల వరకు సరఫరాలో అంతరాయం ఉంటుందని విజ్ఞప్తి చేశారు. విద్యుత్ వినియోగదారులు ఈ విషయాన్ని గమనించాలని సూచించారు.

జిల్లాస్థాయి యోగాసన పోటీలు



ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): జిల్లాస్థాయి యోగాసన పోటీలు ఈనెల 30న జరుగుతాయని సిద్దిపేట జిల్లా యోగాసనా స్పోర్ట్స్ అసోసియేషన్ అధ్యక్షుడు తోట అశోక్, ప్రధాన కార్యదర్శి నిమ్మ శ్రీనివాస్ రెడ్డిలు మంగళవారం తెలిపారు. సబ్ జూనియర్, జూనియర్, సీనియర్ విభాగాల్లో పోటీలు జరగనున్నట్లు తెలిపారు. ట్రెడిషనల్ యోగాసన, ఆర్టిస్టిక్ యోగాసన (సింగిల్, పెయిర్), రిథమిక్ యోగాసన (జంట) విభాగాల్లో పోటీలు ఉంటాయని పేర్కొన్నారు. పోటీలో పాల్గొనే వారు వయసు ధ్రువీకరణ పత్రం, బోనఫైడ్‌తో పాటు ఫొటోను సమర్పించాలని తెలిపారు. ప్రతి విభాగంలో మొదటి 3 స్థానాల్లో నిలిచిన విజేతలను రాష్ట్రస్థాయి యోగాసనా పోటీల్లో పాల్గొనే అవకాశం ఉంటుందన్నారు. వివరాలకు 63022-27030, 91601-39889, 90001-90589 ఫోన్ నంబర్లలో సంప్రదించి పేరు నమోదు చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

ఎస్సీ, ఎస్టీ కేసు పెట్టాల్సిందే

కేవీపీఎస్ జిల్లా అధ్యక్షుడు బాలకిషన్



మాట్లాడుతున్న బక్కెల్లి బాలకిషన్

కొమురవెల్లి(సిద్దిపేట): మర్కుక్ మండలం శివారు వెంకటాపూర్‌లో దళితులకు ఆలయ ప్రవేశంలేదని దళితులను వెలివేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని కేవీపీఎస్ (కులవివక్ష పోరాట సమితి) జిల్లా అధ్యక్షుడు బక్కెల్లి బాలకిషన్ డిమాండ్ చేశారు. మంగళవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. శివారు వెంకటాపూర్‌లో ఈనెల 21 నుంచి 25వ తేదీ వరకు గ్రామస్తులందరూ గ్రామదేవతలకు బోనాలు సమర్పించారన్నారు. 24న సాయత్రం దుర్గమ్మకు బోనాలు చేస్తున్న క్రమంలో గ్రామానికి చెందిన కొందరు.. దళితులను 'మాదిగోళ్లు మీరు గుడిలోకి వస్తారా' అంటూ అసభ్య పదజాలంతో తిట్టి వెలివేశారని ఆరోపించారు. దళితులను ఆలయంలో నుంచి వెలివేసిన వారిపై ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు చేసి సదరు వ్యక్తులను రిమాండ్‌కు తరలించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జిల్లా సహాయ కార్యదర్శి కర్రోళ్ల ఎల్లయ్య, ఆరుట్ల రవీందర్, కసాల రాజేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

భౌభౌలతో బెంబేలు

- రోజుకు పదుల సంఖ్యలో కుక్క కాటు బాధితులు
- తాజాగా దుబ్బాకలో వృద్ధురాలిపై దాడి
- మొన్న విహాన్ మృతి.. నిన్న హన్సితకు గాయాలు
- ప్రజల్లో భయాందోళన
- ఇటీవలే ఏబీసీ సెంటర్ పునఃప్రారంభం

వీధి కుక్కలు వీర విహారం చేస్తున్నాయి. ఏదొక ప్రాంతంలో జనం కుక్క కాటు బారిన పడుతున్నారు. బాధితుల్లో వృద్ధులు, చిన్నారులే ఎక్కువగా ఉన్నారు. ఇటీవల జిల్లాకు చెందిన చిన్నారి శునకం దాడిలో తీవ్రంగా గాయపడి మృతిచెందటం చర్చనీయాంశమైంది. ఈ ఉదంతం మరువక ముందే దుబ్బాకలో ఓ వృద్ధురాలు తీవ్రంగా గాయపడటం కలకలం రేపింది.





ఖాదర్‌పురలో దాడికి యత్నిస్తున్న కుక్కలు

సాక్షి, సిద్దిపేట: రోజుకు పదుల సంఖ్యల్లో జనంపై వీధి కుక్కలు దాడులు చేస్తున్నాయి. దీంతో ప్రజలు రోడ్డుపైకి రావాలంటేనే జంకుతున్నారు. మొన్న మిరుదొడ్డి మండలానికి చెందిన చిన్నారి విహాన్‌ను జూలై 16న హైదరాబాద్‌లో కుక్కల దాడి చేయగా చికిత్స పొందుతూ మృతిచెందాడు. ఈ ఘటన మరవక ముందే ఈనెల 26న అక్బర్‌పేట–భూంపల్లి మండలం బేగంపేటలో పాప హన్సితపై దాడి చేశాయి. ఇలా వరుస సంఘటనలు జిల్లా ప్రజలను ఆందోళనకు గురిచేస్తున్నాయి.

రోజుకు 10 మంది ..

జిల్లా వ్యాప్తంగా నగటున ఎక్కడో ఒక దగ్గర 10 నుంచి 12 మంది కుక్క కా టుకు గురవుతున్నారు. జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేటు ఆస్పత్రుల్లో కుక్క కాటు వ్యాక్సిన్‌లు వేయించుకుంటున్నారు. అసలే శునకాలకు బ్రీడింగ్ సీజన్ కావడంతో వింత ప్రవర్తనను కలిగి ఉంటున్నాయి. దీంతో చిన్నారులు, వృద్ధులే ల క్ష్యంగా కరుస్తున్నాయని పశు వైద్యులు చెబుతున్నారు.

ఇటీవల ఏబీసీ ప్రారంభం

కుక్కలను చంపిన వారి కేసులు నమోదు అవుతుండటంతో కుక్కలకు కుటుంబ నియంత్రణ(కు.ని) చేయాలని నిర్ణయించారు. దీంతో ఏప్రిల్ 10, 2021న సిద్దిపేట పట్టణంలోని పశు సంవర్థక ఆస్పత్రి ఆవరణలో ఏబీసీ (యానిమల్ బర్త్ కంట్రోల్) కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. వెట్స్ సొసైటీ ఫర్ యానిమల్ వెల్ఫేర్ ఆధ్వర్యంలో మార్చి 2022 వరకు కొనసాగించారు. కుక్కల సంతతి పెరుగుతుండటంతో ఈనెల 24న మళ్లీ పునఃప్రారంభించారు. ఇప్పటి వరకు 25 శునకాలకు కు.ని. చేయగా ఇంకా 35ను తీసుకువచ్చారు. ఒక్కో కుక్కకు కు.ని చేసినందుకు గాను రూ. 1,650లను చెల్లించాలి. వీటికి సంబంధించి సిద్దిపేట, గజ్వేల్, దుబ్బాక, హుస్నాబాద్, చేర్యాల మున్సిపాలిటీలు ఎంఓయూ చేసుకున్నాయి.

పల్లెల్లో ఎలా?

గ్రామ పంచాయతీలు ప్రత్యేక అధికారుల పాలనలో కొనసాగుతు న్నాయి. వీటికి నిధులు కొరత వేధిస్తోంది. దీంతో ఏబీసీ సెంటర్‌లో కు.ని. చేయించేందుకు కూడా నిధులు లేని పరిస్థితి ఇక్కడ కనిపిస్తోంది. కాగా, గ్రామాల్లో వీధి కుక్కలు విచ్చలవిడిగా పెరిగే అవకాశం ఉంది. కలెక్టర్, ప్రజాప్రతినిధులైన ముందు కొచ్చి కుక్కల నియంత్రణకు కు.ని శస్త్ర చికిత్స కోసం ప్రత్యేకంగా నిధులు కేటాయించాల్సిన అవసరం ఉంది. ఇప్పటికైన ప్రత్యేక చొరవ తీసుకుని కుక్కల కట్టడికి చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

మున్సిపాలిటీలతో ఎంఓయూ



ఏబీసీ సెంటర్ ద్వారా కుక్కల కు.ని శస్త్ర చికిత్సల కోసం యానిమల్ వెల్ఫేర్ సొసైటీకి మున్సిపాలిటీలు ఎంఓయూ చేసుకున్నాయి. సిద్దిపేట, గజ్వేల్, దుబ్బాక, హుస్నాబాద్, చేర్యాల మున్సిపాలిటీలున్నాయి. ఒక్కో కుక్కకు కు.ని. చేసినందుకు రూ 1,650లను చెల్లించనున్నాం. క్యాచింగ్, లివింగ్, సర్జరీ చేయనున్నారు. ఇప్పటి వరకు 25 కుక్కలకు చేయించాం.

– ప్రేరణ, కమిషనర్, సిద్దిపేట మున్సిపాలిటీ

ప్రాణాలు తీస్తున్నాయి



కుక్కలు ప్రజల ప్రాణాలు తీస్తున్నాయి. వాటి దాడిలో చిన్నారుల మృతిచెండటం చాలా బాధ కలిగిస్తోంది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలెన్నో చట్టాలను సవరిస్తున్నాయి. జంతు సవరణ చట్టాలను కూడా సవరణలు చేయాలి. కుక్కల దాడిలో గాయపడ్డ కుటుంబాల పరిస్థితి చాలా దయనీయం.

–గోనె మధు, దుబ్బాక



సిద్దిపేటకమాన్: జనరల్ ఆస్పత్రిలోని రోగులతో మాట్లాడుతున్న కలెక్టర్ మనుచౌదరి

అధికారులు అప్రమత్తం

కలెక్టర్ మనుచౌదరి

సిద్దిపేటకమాన్: డెంగీ, మలేరియా, డయేరియా కేసులపై అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ మనుచౌదరి వైద్యులను ఆదేశించారు. సిద్దిపేట ప్రభుత్వ మెడికల్ కళాశాల అనుబంధ జనరల్ ఆస్పత్రిని ఆయన మంగళవారం పరిశీలించారు. ఆస్పత్రిలో గల డెంగీ, మలేరియా కేసుల వివరాలను ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ కిషోర్‌కుమార్‌ను అడిగి తెలుసుకున్నారు. ఆయా వార్డులకు వెళ్లి చికిత్స పొందుతున్న పెషెంట్లతో మాట్లాడారు. ఎమర్జెన్సీ వార్డులో గల డిపార్ట్‌మెంట్ ఆఫ్ సైకియాట్రిక్ డిఅడిక్షన్ సెంటర్‌ను పరిశీలించారు. మత్తు పదార్థాలకు బానిసై చికిత్స పొందుతున్న వారికి తప్పనిసరిగా నయమయ్యే వరకు చికిత్స అందించాలని డాక్టర్ శాంతి తెలిపారు. ఇప్పటి వరకు 19 డెంగీ కేసులు, మలేరియా, డయేరియా ఒకటి చొప్పున కేసులు వచ్చాయన్నారు.

పిల్లలకు పౌష్టికాహారం తప్పనిసరి

సిద్దిపేటఅర్బన్: అంగన్‌వాడీ కేంద్రాలకు ప్రభుత్వం అందించే పౌష్టికాహారాన్ని పిల్లలందరూ తప్పనిసరిగా తినేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ మనుచౌదరి అన్నారు. మంగళవారం సిద్దిపేట అర్బన్ మండలం మిట్టపల్లి.. అంగన్‌వాడీ పూర్వ ప్రాథమిక పాఠశాల -2, మందపల్లి ఆవాస గ్రామం పిట్టలవాడలో ప్రాథమిక పాఠశాల ఏర్పాటుకు స్థల పరిశీలన, కేసీఆర్ నగర్‌లో ప్రాథమిక పాఠశాల, ఉన్నత పాఠశాలను సందర్శించారు. ఈ సందర్భంగా మిట్టపల్లి అంగన్‌వాడీ సెంటర్‌లో కొత్తగా వేయించిన టైంటేబుల్, ఫుడ్ మెనూ, పిల్లల సమగ్రాభివృద్ధికి ఉపయోగపడే పలు చిత్రాలతో కూడిన పేయింటింగ్‌లను జిల్లా సంక్షేమ అధికారి శారద చూపించగా బాగున్నాయన్నారు. మిట్టపల్లిలో డెంగీ, మలేరియా కేసులు ఏమైనా గుర్తించారా అని ఆశావర్కర్లను అడిగారు. ఇప్పటి వరకు ఏమీ లేవన్నారు.

పిట్టలవాడలో ప్రాథమిక పాఠశాల ఏర్పాటుకు చర్యలు

అలాగే మందపల్లి ఆవాస గ్రామం పిట్టలవాడలో ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల ఏర్పాటు కోసం స్థలాన్ని పరిశీలించారు. భవనం లేక పాఠశాల అందుబాటులో లేదని, గతంలోనే పాఠశాల కోసం కొంత స్థలాన్ని కేటాయించారని డీఈఓ శ్రీనివాస్‌రెడ్డి దృష్టికి తీసుకువచ్చారు.

చెరువుల పూర్తి సమాచారం అందించాలి

సిద్దిపేటరూరల్: సిద్దిపేట నియోజకవర్గంలో 20 ఏళ్లుగా ఉన్న చెరువులు, కుంటలకు సంబంధించిన అన్ని వివరాలను స.హ. చట్టం ప్రకారం కోరుతూ కాంగ్రెస్ నాయకులు చక్రధర్‌గౌడ్ మంగళవారం కలెక్టర్ మను చౌదరికి ఫిర్యాదు చేశారు. 2004లో అన్ని గ్రామాల్లో ఉన్న చెరువుల విస్తీర్ణం, ప్రస్తుత విస్తీర్ణ వివరాలను అందజేయాలన్నారు.

చిత్తశుద్ధితో పనిచేయాలి

- ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి
- సంక్షేమ హాస్టల్స్, వ్యవసాయశాఖ అధికారులతో సమీక్ష



సమీక్షలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి

దుబ్బాక: ప్రభుత్వ అధికారులు ప్రజాసమస్యల పరిష్కారంలో చిత్తశుద్ధితో పని చేయాలని ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి అన్నారు. మంగళవారం పట్టణంలోని క్యాంపు కార్యాలయంలో వ్యవసాయ శాఖ అధికారులు, సంక్షేమ హాస్టల్స్ అధికారులతో కలిసి ఆయన వేర్వేరుగా సమీక్షించారు. అలాగే సీఎంఆర్ఎఫ్ చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ముందుగా దుబ్బాక వ్యవసాయ సబ్‌డివిజన్‌లో ఎంత మందికి రూ. 2 లక్షల రుణ మాఫీ జరిగింది, మాఫీ కాని రైతుల విషయంపై చర్చించారు. కేవలం 60 శాతం మాత్రమే రైతులకు రుణమాఫీ జరగడంపై రైతులు ఇబ్బందులు పడుతున్నారని, వీరి కోసం గ్రామాలు, పట్టణాల్లో హెల్ప్ డెస్క్‌లు ఏర్పాటు చేసి రైతులందరికీ రుణమాఫీ అయ్యేలా చర్యలు తీసుకోవాలన్నారు. అలాగే సంక్షేమ హాస్టళ్లలో సవాలక్ష సమస్యలతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. కాస్మోటిక్ చార్జీలు సరిగ్గా రాకపోవడంపై ఆవేదన వ్యక్తం చేశారు. ఇక ఆర్‌అండ్‌బీ, పీఆర్ రోడ్లు అధ్వానంగా తయారయ్యాయన్నారు.

హైడ్రా పేరుతో హైడ్రామా

రాష్ట్రంలో ప్రజాసమస్యలు గాలికొదిలేసి సీఎం రేవంత్‌రెడ్డి హైడ్రా పేరిట హైడ్రామా రాజకీయాలు చేస్తున్నాడని దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి విమర్శించారు. పలు బాధిత కుటుంబాలకు సీఎంఆర్ఎఫ్, రోడ్డు ప్రమాదంలో మరణించిన తాళ్లపల్లికి చెందిన బీఆర్ఎస్ కార్యకర్త ప్రవీణ్ కుటుంబానికి రూ.2లక్షల చెక్కును అందించారు. ఎన్నికల ముందు నోటికొచ్చిన హామీలిచ్చిన సీఎం నేడు అమలు చేయడంలో పూర్తిగా విఫలమయ్యాడన్నారు. 8 నెలల్లో కాంగ్రెస్ ప్రభుత్వం కొత్తగా చేసిందేంలేదన్నారు. ఉన్న వ్యవస్థలను నాశనం చేసిందన్నారు. సమావేశంలో బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు మనోహర్‌రావు, రాజమౌళి, రవీందర్‌రెడ్డి, కిషన్‌రెడ్డి, రాంరెడ్డి, భూంరెడ్డి, ఎల్లారెడ్డి,లింగం తదితరులున్నారు.



ర్యాలీ నిర్వహిస్తున్న కాంగ్రెస్ నాయకులు

హైడ్రాకు మద్దతుగా ర్యాలీ

హుస్నాబాద్: చెరువులు, కుంటలను కాపాడుకోవడం కోసం అక్రమ కట్టడాలను కూల్చివేస్తున్న హైడ్రాకు మద్దతుగా పట్టణంలో మంగళవారం కాంగ్రెస్ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆపార్టీ నాయకులు మాట్లాడుతూ హైడ్రాను ఒక హైదరాబాద్‌కే కాకుండా జిల్లాకు, మండలానికి, ప్రతి మారుమూల గ్రామంలోకి రావాలన్నారు. చెరువులు, కుంటలు, కాలువలను కాపాడుకునేందుకు అవసరమన్నారు. జల వనరులను కాపాడుకుంటే భవిష్యత్ తరాలకు ఎంతగానో ఉపయోగపడుతాయన్నారు. ఈ ప్రాంత ప్రజలు హైడ్రాకు మద్దతుగా నిలువాలన్నారు. కార్యక్రమంలో పీసీసీ సభ్యుడు కేడం లింగమూర్తి, సింగిల్ విండో చైర్మన్ బొలిశెట్టి శివయ్య, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు బంక చందు, కౌన్సిలర్లు చిత్తారి పద్మ, వల్లపు రాజు, సరోజన, కోమటి స్వర్ణలత, నాయకులు చిత్తారి రవీందర్, కోమటి సత్యనారాయణ, కిష్టస్వామి, రమేశ్ నాయక్, రమేష్, ముప్పిడి రాజిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఇచ్చిన హామీలను నెరవేర్చండి

నల్లబ్యాడ్జీలతో డిపో ఎదుట ఆర్టీసీ కార్మికుల ధర్నా



దుబ్బాకటౌన్: డిపో ఎదుట నల్లబ్యాడ్జీలతో నిరసన తెలుపుతున్న ఆర్టీసీ కార్మికులు

దుబ్బాకటౌన్: ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఆర్టీసీ కార్మికులకు ఇచ్చిన హామీలను వెంటనే పరిష్కరించాలని దుబ్బాక ఆర్టీసీ జేఏసీ కన్వీనర్ అబ్దుల్ అజీమోద్దీన్ అన్నారు. తమకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలంటూ మంగళవారం దుబ్బాక ఆర్టీసీ బస్సు డిపో ఎదుట నల్లబ్యాడ్జీలతో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే ఆర్టీసీ కార్మికులను ప్రభుత్వంలో విలీనం, రెండు పీఆర్సీలను బకాయిలతో సహా చెల్లిస్తామని హామీ ఇచ్చిందని గుర్తు చేశారు. పార్టీ అధికారంలోకి వచ్చి 9 నెలలు గడుస్తున్నా వీటిని నెరవేర్చకపోవడం దారుణమన్నారు. బస్సులను ఆధునీకరించి అధునాతనమైన సౌకర్యాలతో నూతన సర్వీసులను ప్రారంభిస్తామని చెప్పి ఇప్పటి వరకు అమలు చేయకపోవడం బాధాకరమన్నారు. ఆర్టీసీ ఉద్యోగులను ప్రభుత్వంలో విలీనం చేయడానికి గత ఏడాదే గెజిట్ వచ్చినప్పటికి ప్రభుత్వాలు మారిన సమస్యకు మోక్షం లభించడం లేదని మండిపడ్డారు. తమకు ఇచ్చిన ఆరు హామీలను నెరవేర్చకుంటే రానున్న రోజుల్లో ఉద్యమాలు చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఆర్టీసీ జేఏసీ నాయకులు గోపాల్ రెడ్డి, లింగం, రమేశ్, మధురవాణి, అంజిరెడ్డి, అనిల్ కుమార్, తదితరులున్నారు.

నల్ల బ్యాడ్జీలతో నిరసన

సిద్దిపేటకమాన్: ప్రభుత్వం తన ఎన్నికల మేనిఫెస్టోలో కార్మికులకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని పట్టణ ఆర్టీసీ డిపో ఎదుట నల్లబ్యాడ్జీలను ధరించి సిబ్బంది మంగళవారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా రాష్ట్ర జేఏసీ కన్వీనర్, సిద్దిపేట జేఏసీ నాయకుడు శేషు మాట్లాడారు. సంస్థ కార్మికులను ప్రభుత్వంలో విలీనం చేస్తామన్నారు. 2021 పీఆర్‌సీ అమలు చేస్తామని చెప్పారు. అన్ని విభాగాల్లో నూతన నియమకాలు చేపట్టి పని భారం తగ్గిస్తామని చెప్పినట్లు గుర్తుచేశారు. బస్సులు కొనుగోలు చేస్తామని చెప్పి తొమ్మిది నెలలు గడిచినా సమస్యలను పరిష్కరించనందున నిరసన తెలుపుతున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో శేషు, రవీందర్, బీఎస్‌గౌడ్, ఎన్ రాజయ్య తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి కోసం తండ్లాట

పునరావాస కాలనీలో దాహార్తి కేకలు వినిపిస్తున్నాయి. భూనిర్వాసితులకు కేటాయించిన స్థలంలో సకల సదుపాయాలు కల్పిస్తామని ప్రజాప్రతినిధులు, అధికారులు చెప్పిన మాటలకు వాస్తవికతకు పొంతన లేదని తెలుస్తోంది. ఇక్కడ ప్రధానంగా తాగు నీటి సమస్య వేధిస్తోంది. కాలనీకి సరఫరా చేసేందుకు నిర్మించిన ట్యాంకు అసంపూర్తిగా ఉంది. సరఫరా ఇవ్వకపోవడంతో సుదూర ప్రాంతాలకు కాలినడకన వెళ్లి వ్యవసాయ బావుల నుంచి నీటిని తెచ్చుకుని గొంతు తడుపుకొంటున్నారు. ఇటీవల మంత్రి, కలెక్టర్ పర్యటించి సమస్యలకు పరిష్కరించాలని అధికారులకు ఆదేశాలిచ్చారు. నేటికీ కూడా అధికారుల నుంచి ఎలాంటి స్పందన రాలేదని కాలనీవాసులు చెబుతున్నారు.



అసంపూర్తిగా ఉన్న ట్యాంక్

- పునరావాస కాలనీలో సమస్యల తిష్ట
- మంచినీటికి బోరే దిక్కు
- నిరుపయోగంగా వాటర్ ట్యాంక్
- ఇంటింటికి విద్యుత్ కనెక్షన్ ఏదీ?
- ఇబ్బందుల్లో కాలనీవాసులు
- పట్టించుకోని అధికారులు

అక్కన్నపేట(హుస్నాబాద్): గౌరవెల్లి ప్రాజెక్టు పునరావాస కాలనీలో పలు సమస్యలు వెంటాడుతున్నాయి. గుక్కెడు తాగునీరు కోసం గోస పడుతున్నారు. అక్కన్నపేట మండలం నందారం స్టేజీ వద్ద పునరావాస కాలనీని ప్రభుత్వం ఏర్పాటు చేసింది. ఈ పునరావాస కాలనీలో 185 కుటుంబాలకు ప్లాట్లను కేటాయిస్తూ గత ప్రభుత్వంలో పట్టాలను అందజేసింది. దీంతో ప్రస్తుతం 60 నుంచి 70 నిర్వాసిత కుటుంబాలు ఇళ్లను నిర్మించుకున్నారు. మిగతా వారు కూడా నిర్మాణ పనులు చేపడుతున్నారు.

వేధిస్తున్న సమస్యలు

ఈ పునరావాస కాలనీలో తాగు నీటి సమస్య తీవ్రంగా ఉంది. మిషన్ భగీరథ పథకం కింద ట్యాంక్ నిర్మాణం చేశారే తప్ప భగీరథ నీరు సరఫరా మాత్రం నేటికీ అందించలేకపోయారు. దీంతో ఇళ్లు నిర్మాణ సమయంలో వేసుకున్న బోర్లే దిక్కుగా మారాయని చెబుతున్నారు. బోరు నీరు సరిపోకపోవడంతో చుట్టుపక్కల వ్యవసాయ బావుల వద్దకు వెళ్లి తాగునీరు తెచ్చుకుంటున్నారు. అదేవిధంగా విద్యుత్ స్తంభాలను ఏర్పాటు చేశారు తప్ప ఇంటింటికి విద్యుత్ కనెక్షన్ ఇవ్వలేదు. అక్కడున్న ఓ ట్రాన్స్‌ఫార్మర్ నుంచి వైర్లు లాక్కొని ఇంటింటికి కనెక్షన్ ఇచ్చుకున్నామని వాపోతున్నారు.

ఎక్కడ వేసిన గొంగళి అక్కడే..

మంత్రి పొన్నం ప్రభాకర్, కలెక్టర్ మనుచౌదరి గత నెల 6న పునరావాస కాలనీలో పర్యటించారు. దీంతో తాగు నీరు, భగీరథ నీరు, విద్యుత్ సమస్యలు అధికంగా ఉన్నాయని భూ నిర్వాసితులు నివేదించారు. అక్కడిక్కడే జిల్లా ఉన్నతాధికారులకు స్వతరమే సమస్యలను పరిష్కారించాలని ఆదేశించారు. కానీ క్షేత్రస్థాయిలో సమస్యలు పరిష్కరం కాక ఎక్కడ వేసిన గొంగళి అక్కడే చందంగా మారింది. ఇప్పటికైనా కలెక్టర్ దృష్టి సారించి సమస్యల పరిష్కారం కోసం చర్యలు తీసుకోవాలని నిర్వాసితులు కోరుతున్నారు.

తాగునీటికి ఇబ్బంది



తాగు నీరు అందక చాలా ఇబ్బందులను ఎదుర్కొంటున్నాం. ఇంటి నిర్మాణంలో వేసిన బోరు నీరే తాగుతున్నాం. భగీరథ నీళ్ల తాగుదామంటే దొరకడం లేదు. పునరావాస కాలనీలో సమస్యలు తిష్టవేశాయి. మమ్మల్ని మా సమస్యలను పట్టించుకునే వారే లేరు. ప్రాజెక్టుకు భూములిస్తే సకల సౌకర్యాలతో పునరావాస కాలనీ నిర్మిస్తామని ప్రగల్బాలు పలికి వదిలేశారు.

– జరుపుల హమల్, పునరావాస కాలనీ

టెండర్ దశలో ఉంది

పునరావాస కాలనీలో ట్యాంక్ నిర్మాణం పూర్తి చేశాం. కానీ పైపులైన్, సంపు తదితర నిర్మాణానికి నిధులు, టెండర్ కావాల్సి ఉంది. టెండర్ పూర్తికా గానే పనులు ప్రారంభించి భగీరథ నీరు అందించేందుకు కృషి చేస్తాం.

– మౌనిక, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ

విద్యుత్ గ్రీవెన్స్‌డేకు అనూహ్య స్పందన



దరఖాస్తులు స్వీకరిస్తున్న సీజీఆర్ఎఫ్ చైర్మన్ నాగేశ్వర్ తదితరులు

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): విద్యుత్ వినియోగదారుల సమస్యలపై మంగళవారం జిల్లా విద్యుత్ భవన్‌లో నిర్వహించిన గ్రీవెన్స్ డేకు అనూహ్య స్పందన వచ్చింది. ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు సీజీఆర్ఎఫ్ (కన్స్యూమర్ గ్రీవెన్సెస్ రీడ్రెసెల్ ఫోరం) ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమానికి సీజీఆర్ఎఫ్ చైర్మన్ నాగేశ్వర్, ఫైనాన్స్ మెంబర్ రామంజీనాయక్‌లు హాజరయ్యారు. దరఖాస్తులను స్వీకరించారు. మొత్తంగా 73 దరఖాస్తులు వచ్చాయన్నారు. అత్యధికంగా విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌లు, విద్యుత్‌పోల్‌లు (స్తంభాలు), విద్యుత్ సరఫరా లైన్‌ల మార్పుకు సంబంధించిన దరఖాస్తులు వచ్చాయన్నారు. విద్యుత్ సరఫరాకు సంబంధించిన ఎలాంటి సమస్యలు అయిన నేరుగా జిల్లా విద్యుత్‌శాఖ కార్యాలయంలో దరఖాస్తు అందిస్తే, పరిష్కారం అందించనున్నట్లు తెలిపారు. విద్యుత్‌శాఖ ఎస్ఈ చంద్రమోహన్, సిబ్బంది పాల్గొన్నారు.

క్లుప్తంగా

అంతర్జాతీయ కరాటే పోటీల్లో చేర్యాల విద్యార్థుల ప్రతిభ


చేర్యాలకు చెందిన విద్యార్థులతో పాషా

చేర్యాల(సిద్దిపేట): అంతర్జాతీయ కరాటే పోటీల్లో చేర్యాల విద్యార్థులు ప్రతిభ కనబర్చినట్లు ఫెడరేషన్ రాష్ట్ర టీం కోచ్ సెన్సాయి ఎం ఎస్.పాషా తెలిపారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ పశ్చిమ బెంగాల్ రాష్ట్రం కోల్‌కత్తా స్కాట్ గార్డెన్లో మూడు రోజుల పాటు జరిగిన అంతర్జాతీయ కరాటే పోటీల్లో చేర్యాలకు చెందిన విద్యార్థులు ప్రతిభ చాటి బంగారు పతకాలు సాధించినట్లు తెలిపారు. ఈ నెల 24 నుంచి 26 వరకు జరిగిన పోటీల్లో 18 దేశాల నుంచి సుమారు 600 మంది క్రీడాకారులు పాల్గొనగా.. చేర్యాలకు చెందిన సీహెచ్.రాజ్‌కుమార్, సీహెచ్.అభినవ్‌లు 13–17 ఏళ్లలోపు విభాగంలో కాంస్య పతకాలు గెలుచుకున్నారని తెలిపారు. ఫెడరేషన్ చైర్మన్ తకాశి యామగుచి చేతుల మీదుగా సోమవారం రాత్రి బెల్టులు, జ్ఞాపికలను అందుకున్నట్లు తెలిపారు.

చికిత్స పొందుతున్న చిన్నారి


ఉస్మానియాలో చికిత్స పొందుతున్న హన్సిత

మిరుదొడ్డి(దుబ్బాక): అక్బర్‌పేట–భూంపల్లి మండల పరిధిలోని బేగంపేటలో కుక్కల దాడిలో తీవ్రంగా గాయపడి చావుబతుకుల మధ్య కొట్టుమిట్టాడుతున్న చిన్నారి హన్సిత హైదరాబాద్‌లోని ఉస్మానియా ఆసుపత్రిలో చికిత్స పొందుతోంది. హన్సిత తలకు డాక్టర్లు శస్త్ర చికిత్స చేసినట్లు చిన్నారి తల్లిదండ్రులు దేవేందర్, లాస్య 'సాక్షి'కి ఫోన్ ద్వారా తెలిపారు. చిన్నారి పరిస్థితి ఇంకా విషమంగానే ఉందని, ప్రభుత్వం స్పందించి మెరుగైన చికిత్స అందించాలని వారు వేడుకుంటున్నారు.

డ్రంకెన్ అండ్ డ్రైవ్‌లో 23 మందికి జరిమాన

పటాన్‌చెరు టౌన్: డ్రంకెన్ అండ్ డ్రైవ్‌లో పట్టుబడిన 23 మంది వాహనదారులకు సంగారెడ్డి జిల్లా కోర్టు 2 వేల చొప్పున జరిమానా విధించింది. ట్రాఫిక్ సీఐ లాలూ నాయక్ తెలిపిన వివరాల ప్రకారం.. ఆదివారం, సోమవారం నిర్వహించిన డ్రంకెన్ అండ్ డ్రైవ్‌లో 23 మందిని పట్టుకున్నట్లు చెప్పారు. పట్టుబడిన వాహనదారులను మంగళవారం సంగారెడ్డి కోర్టులో హాజరు పర్చగా, న్యాయమూర్తి పై జరిమాన విధించినట్లు తెలిపారు.

అదృశ్యమై.. శవమై తేలి..


కోల సుధీర్ (ఫైల్)

కౌడిపల్లి(నర్సాపూర్): అదృశ్యమైన ఓ యువకుడు కుంటలో శవమై కనిపించాడు. ఈ సంఘటన మండలంలోని తునికి హరిచంద్‌తండా పంచాయతీ పరిధిలోని దేవులతండాలో చోటుచేసుకుంది. ఎస్ రంజిత్‌రెడ్డి కథనం ప్రకారం.. దేవులతండాకు చెందిన కోల లక్ష్మి పెద్దకొడుకు కోల సుధీర్(25) ఇంటర్ పూర్తిచేసి ప్రస్తుతం మేకలను మేపడంతోపాటు వ్యవసాయ పనులు చేస్తూ కుటుంబానికి అండగా ఉంటున్నాడు. సోమవారం రాత్రి ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. దీంతో రాత్రి కుటుంబ సభ్యులు వెతకగా ఆచూకి లభించలేదు. మంగళవారం ఉదయం తండా సమీపంలోని అడవివద్దగల పుల్చెరుకుంట వద్ద అతని చెప్పులు ఉండటంతో తండావాసులు, కుటుంబ సభ్యులు కుంటలో వెతకగా.. సుధీర్ మృతదేహం లభించింది. కేసు దర్యాప్తులో ఉంది.

లైసెన్స్ కార్డుల కటకట

- ఏడాది నుంచి వాహనదారుల ఎదురుచూపులు
- కార్యాలయం చుట్టూ ప్రదక్షిణలు
- వాహనదారులు రోడ్డెక్కితే జరిమానాలు
- త్వరలో యూనిట్ ఆఫీస్ వారీగా కార్డుల జారీ
- ఇన్‌చార్జి డీటీవో కొండల్ రావు



హుస్నాబాద్: ఏడాదైనా లైసెన్సు కార్డులు అందక వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. వాహనాలకు రిజిస్ట్రేషన్లు, లైసెన్స్ కార్డులు తప్పనిసరిగా ఉండాలని అధికారులు చెబుతున్నా.. కార్డులు సకాలంలో పంపిణీ చేయడంలో విఫలమవుతున్నారు. వాహనం కొత్త రిజిస్ట్రేషన్లు, ట్రాన్స్‌పోర్టు, నాన్ ట్రాన్స్‌పోర్టు, డ్రైవింగ్ లైసెన్స్‌లు వంటి సేవలు పొందిన వాహనదారులకు రవాణాశాఖ నుంచి కార్డులు జారీ కావాల్సి ఉంటుంది. రవాణా సేవలు పొందిన వాహనదారులకు 24 గంటల్లోనే వాహన పత్రాలు ఇస్తామని ఆ శాఖ కార్యాలయంలోని సిటిజన్ చార్ట్‌లో స్పష్టంగా కనబడుతుంది. అయితే..ఈ విధానం క్షేత్రస్థాయిలో అమలు కావడం లేదన్న విమర్శలు వినవస్తున్నాయి. లైసెన్స్ కోసం దరఖాస్తు చేసుకున్నప్పుడే స్మార్ట్ కార్డుకు రూ.200, పోస్టల్ చార్జి కింద రూ.25 ముందుగానే అధికారులు వసూలు చేస్తున్నారు. వివిధ రకాల కార్డులు పోస్టల్ ద్వారా వాహనదారుడి అడ్రస్‌కు పంపించాలి. లేదంటే వాహనదారుడు కార్యాలయానికి వెళ్లి స్వయంగా తీసుకోవాల్సి ఉంటుంది.

> **జాబితాను సిద్ధం చేస్తున్నాం**
>
> 
>
> పోస్టల్ ద్వారా లైసెన్స్ కార్డుల జారీలో ఆలస్యం అవుతుందన్న మాట వాస్తవమే. కొన్ని తిరిగి వస్తున్నాయి కూడా. లైసెన్స్ కార్డులు రాని వారి వాహనదారుల జాబితాను తయారు చేస్తున్నాం. యూనిట్ ఆఫీస్‌ల వారిగా అక్కడే లైసెన్స్ కార్డులు ఇచ్చేలా చర్యలు తీసుకుంటున్నాం. ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదు. త్వరలోనే యూనిట్ ఆఫీస్ వారీగా లైసెన్స్ కార్డులను జారీ చేస్తాం.
>
> – ఇన్‌చార్జి డీటీఓ. కొండల్‌రావు, సిద్దిపేట

దాదాపు ఏడాది గడుస్తున్నా ఇంత వరకు లైసెన్స్ కార్డులు రాకపోవడంతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. జిల్లా కార్యాలయానికి వెళితే.. సరైన సమాధానం రావడం లేదని వారు వాపోతున్నారు. గత ప్రభుత్వ హయాంలో బీఎస్ 4 ద్విచక్రవాహనాలకు రిజిస్ట్రేషన్లు చేసేవారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక టీఎస్ నుంచి టీజీగా మారిన తర్వాత ట్రాన్స్‌పోర్ట్ వెబ్‌సైట్‌లో వెహికిల్ ఇన్‌స్పెక్షన్ కాలం తొలగించారు. దీంతో వందలాది మందికి చెందిన బీఎస్ 4 బైక్‌లకు రిజిస్ట్రేషన్లు కావడం లేదు. దీంతో వాహనదారులు రిజిస్ట్రేషన్ల కోసం కార్యాలయాల చుట్టు తిరుగుతున్నా ఫలితం కనబడటం లేదు.

రోడ్డెక్కాలంటే జంకుతున్న వాహనదారులు

లైసెన్స్ కార్డులు లేకపోవడంతో వాహనదారులు రోడ్కెక్కాలంటే జంకుతున్నారు. పోలీసులు ఎక్కడ వాహనాలు ఆపుతారోనని ఆందోళన చెందుతున్నారు. వాహనాలకు రిజిస్ట్రేషన్లు ఉన్నప్పటికీ లైసెన్స్, ఆర్‌సీ కార్డులు లేవని పోలీసులు వాహనాలను ఆపి జరిమానాలు విధిస్తున్నారు. అధికారుల తప్పిదంతో పోలీసుల నుంచి తప్పించుకొని వాహనాలు నడుపుతున్నామని వాహనదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వాహనదారులు కార్డుల కోసం కార్యాలయాల చుట్టూ తిరుగుతుంటే డూప్లికేట్ లైసెన్స్‌ల కోసం దరఖాస్తులు చేసుకోవాలని అధికారులు ఉచిత సలహా ఇస్తున్నారు. ముందుగానే స్మార్ట్‌కార్డు, పోస్టల్ చార్జీలు తీసుకుంటున్న అధికారులు.. కార్డుల జారీలో ఎందుకు జాప్యం చేస్తున్నారని వాహనదారులు ప్రశ్నిస్తున్నారు.

78 కిలోల గంజాయి పట్టివేత

నిందితుడి అరెస్టు, వాహనం స్వాధీనం

మునిపల్లి(అందోల్): పుష్ప సినిమా తరహాలో టాటా సఫారీ వాహనం సీట్ల కింద 78 కిలోల ఎండు గంజాయిని కవర్ పాకెట్లలో పెట్టి తరలిస్తుండగా ఎక్సైజ్‌శాఖ అధికారులు పట్టుకున్నారు. మెదక్ డివిజన్ ఎక్సైజ్, ఎన్‌ఫోర్స్‌మెంట్ అసిస్టెంట్ శ్రీనివాస్‌రావు కథనం ప్రకారం.. మంగళవారం తెల్లవారుజామున 65వ నంబర్ జాతీయ రహదారి కంకోల్ టోల్‌ప్లాజా సమీపంలో విశ్వసనీయ సమాచారం మేరకు వాహనాన్ని తనిఖీ చేశారు. వాహనాన్ని క్షుణ్ణంగా పరిశీలించగా.. గంజాయిని కవర్‌లో ప్యాక్ చేసి కారు సీట్ల కింద పెట్టిన విషయాన్ని గమనించామని తెలిపారు. ఆంధ్రప్రదేశ్‌లోని చిత్తురు జిల్లా ఇటవాకిలి గ్రామానికి చెందిన నిందితుడు అఫ్రాఫ్‌ను అదుపులోకి తీసుకున్నామని చెప్పారు. కారుతో పాటు గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. అఫ్రాఫ్‌పై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సీఐ గాంధీ, తదితరులు పాల్గొన్నారు.


అఫ్రాఫ్‌తో పాటు గంజాయి, వాహనాన్ని స్వాధీనం చేసుకున్న అధికారులు

గంజాయి కేసులో ఐదుగురి అరెస్టు

- ముగ్గురు రిమాండ్
- ఇద్దరు మైనర్లను తల్లిదండ్రులకు అప్పగింత

కొమురవెల్లి(సిద్దిపేట): గంజాయి సేవిస్తున్న ఐదుగురిని పోలీసులు అరెస్టు చేశారు. వారిలో ముగ్గురిని రిమాండ్‌కు తరలించి, ఇద్దరు మైనర్లను వారి తల్లింద్రులకు అప్పగించారు. ఈ ఘటన కొమురవెల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. చేర్యాల సీఐ శ్రీను కొమురవెల్లి పోలీస్‌స్టేషన్‌లో విలేకరుల సమావేశంలో కేసు వివరాలను వెల్లడించారు. మంగళవారం ఉదయం నమ్మదగిన సమాచారం మేరకు ఎస్ఐ రాజు సిబ్బందితో కలసి దాసరం గుట్ట పరిసరాలో దాడులు చేయగా.. గంజాయి సేవిస్తున్న ఐదుగురిని అదుపులోకి తీసుకున్నారు. వారిపై కేసు నమోదు చేసి విచారించగా అందులో ఇద్దరు మైనర్లు స్థానికులు కాగా వారి తల్లిదండ్రులను పిలిచి కౌన్సెలింగ్ ఇచ్చి పంపించామన్నారు. సిద్దిపేటకు చెందిన జంగం ఓంకార్, ఎండీ సమీర్, మంగునూరి నగేష్‌లను రిమాండ్ తరలించినట్లు తెలిపారు. వీరందరూ తరచూ చేర్యాల మండలం పోతిరెడ్డి పల్లికి చెందిన ప్రేమ్‌రాజ్ వద్ద గంజాయి కొనుగోలు సేవిస్తున్నట్లు చెప్పారు. అతన్ని కూడా త్వరలో అరెస్టు చేస్తామన్నారు. నిందితుల వద్ద నుంచి 60 గ్రాములు గంజాయి, ఆరు సెల్ ఫోన్‌లు, రెండు ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.


మాట్లాడుతున్న చేర్యాల సీఐ శ్రీను

తప్పిపోయిన బాలుడి అప్పగింత


శ్రీశైలంలో బాలుడిని అప్పగిస్తున్న అశోక్‌రెడ్డి

జహీరాబాద్ టౌన్: తప్పిపోయిన బాలుడిని గుర్తించిన ఓ వ్యక్తి అతని కుటుంబ సభ్యులకు అప్పగించారు. జహీరాబాద్ పట్టణంలోని సాయిరాంనగర్ కాలనీకి చెందిన వీరభద్రయ్య స్వామి కుమారుడు శరణయ్యస్వామి(13) సిద్దార్థ హైస్కూల్‌లో 7వ తరగతి చదువుతున్నాడు. శ్రీకృష్ణ జన్మాష్టమి పండుగ సందర్భంగా స్కూల్‌కు సెలవు ఉండడంతో సోమవారం ఇంట్లో వెయ్యి రూపాయలు తీసుకొని వెళ్లిపోయాడు. జహీరాబాద్‌లో బస్సు ఎక్కి హైదరాబాద్‌కు చేరుకుని, అక్కడి నుంచి శ్రీశైలం వెళ్లే సూపర్ లగ్జరీ బస్సు ఎక్కి కూర్చున్నాడు. అదే బస్సులో మొగుడంపల్లి మండలం మన్నాపూర్ గ్రామ మాజీ సర్పంచ్ ఈశ్వర్‌రెడ్డి అన్న అశోక్‌రెడ్డి కూడా ఉన్నారు. కొంత దూరం వెళ్లిన తర్వాత బాలుడిని చూసి అశోక్ రెడ్డికి అనుమానం వచ్చింది. బాలుడు జహీరాబాద్ ప్రాంతానికి చెందినట్లుగా ఉన్నాడన్న అనుమానంతో శరణయ్యస్వామి వద్దకు వెళ్లి మాటల్లో దింపాడు. చదవాలని ఒత్తిడి తీసుకురావడంతో అమ్మానాన్నలకు చెప్పకుండా వచ్చానన్నాడు. వెంటనే అశోక్‌రెడ్డి జహీరాబాద్‌కు ఫోన్ చేసి తల్లిదండ్రులకు సమాచారం ఇచ్చాడు. బాలుడిని వెంట తీసుకుని శ్రీశైలంలో స్వామి దర్శనం చేయించాడు. రాత్రంతా తన వద్దనే ఉంచుకుని మంగళవారం శ్రీశైలంలో కుటుంబ సభ్యులకు అప్పగించారు.

తాళం వేసి ఉన్న ఇంట్లో చోరీ

రేగోడ్(మెదక్): తాళం వేసి ఉన్న ఇంట్లో చోరీ జరిగిన సంఘటన మండలంలోని మర్పల్లి గ్రామంలో మంగళవారం ఆలస్యంగా వెలుగుచూసింది. ఎస్ఐ పోచయ్య కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన మన్నె లక్ష్మి ఈనెల 22న మల్లన్న గుట్ట ఆశ్రమానికి వెళ్లింది. మంగళవారం తిరిగి ఇంటికి వచ్చేసరికి వేసిన తాళం వేసినట్లుగానే ఉండగా, ఇంట్లోని బీరువాలో ఉన్న రెండున్నర తులాల లాకెట్‌ను దొంగిలించినట్లు బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు. అదే విధంగా క్లూస్ టీం ఆధారాలను సేకరించినట్లు ఎస్ఐ పేర్కొన్నారు.


వివరాలు సేకరిస్తున్న ఎస్ఐ పోచయ్య

వేర్వేరు చోట్ల ముగ్గురి ఆత్మహత్య

పురుగుల మందు తాగి..


ఆగారెడ్డి (ఫైల్)

కోహెడరూరల్(హుస్నాబాద్): పురుగుల మందు తాగి వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ సంఘటన మండలంలోని పోరెడ్డిపల్లిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన బర్లె ఆగారెడ్డి(45) కొన్ని రోజులుగా మద్యానికి బానిసై భార్య మంజులతో తరుచూ గొడవలు పడుతున్నాడు. దీంతో భార్య తన ఇద్దరు పిల్లలను తీసుకొని సిద్దిపేటలో నివసిస్తుంది. ఈ క్రమంలో జీవితంపై విరక్తి చెంది మంగళవారం ఉదయం పురుగుల మందు తాగి ఆగారెడ్డి ఆత్మహత్య చేసుకున్నాడు. గమనించిన గ్రామస్తులు భార్యకు ఫోన్‌లో సమాచారం అందించారు. ఆమె ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

మద్యానికి బానిసై..


భూపాల్ (ఫైల్)

శివ్వంపేట(నర్సాపూర్): మద్యానికి బానిసైన ఓ వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ సంఘటన మండల పరిధి చండి గ్రామంలో చోటుచేసుకుంది. ఎస్సై మహిపాల్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన శివన్నగారి భూపాల్(37) కొంత కాలంగా మద్యానికి బానిసై అప్పులు చేశాడు. అవికాస్త పెరిగాయి. వాటిని తీర్చే మార్గం కానరాలేదు. ఈ విషయమై కుటుంబ సభ్యులు పలుమార్లు మందలించినా ఎలాంటి మార్పు కనిపించలేదు. ఈ క్రమంలో సోమవారం రాత్రి మద్యం మత్తులో ఇంట్లో ఉరివేసుకొని ఆత్మహత్య పాల్పడ్డాడు.

కుటుంబ కలహాలతో..


ప్రవీణ్ (ఫైల్)

రామాయంపేట(మెదక్): మండలంలోని అక్కన్నపేటలో కుటుంబ కలహాలతో యువకుడు ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పోలీసుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన వెల్ముల ప్రవీణ్ (33) కొంతకాలంగా ఆర్థిక, కుటుంబ సమస్యలతో సతమతమతం అవుతున్నాడు. ఈక్రమంలో సోమవారం రాత్రి ఇంటిలోనే ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడికి భార్య, ఐదేళ్లలోపు కూతురు, కుమారుడు ఉన్నారు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు పోలీసులు మంగళవారం కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

దివ్యరథంపై వేణుగోపాలుడు

వర్గల్(గజ్వేల్): గోవింద నామంతో వర్గల్ మార్మోగింది. దివ్యరథంపై శ్రీవేణుగోపాలుని ఊరేగింపు నేత్రపర్వం చేసింది. భక్తజనం పరవశించింది. మంగళవారం గోకులాష్టమి పర్వదినం సందర్భంగా కలశాభిషేకం, లక్షపుష్పార్చనాది కార్యక్రమాలతో వర్గల్ వేణుగోపాలుడి కోవెల శోభిల్లింది. పర్వదినం సందర్భంగా అర్చకులు ఉదయం సుప్రభాత సేవ, బాల భోగం, విశ్వక్సేనారాధన, కలశాభిషేకాది పూజలు నిర్వహించారు. మూలవిరాట్టులను సర్వాభరణాలు, పూలమాలికలతో అలంకరించారు. భక్తజన సామూహిక లక్షపుష్పార్చన చేశారు. మహా నివేదన సమర్పించారు. పురప్రముఖులు, భక్తజనులు వేడుకలో పాల్గొని తరించారు.
– జన్మష్టామి వేళ మంగళవారం రాత్రి 7 గంటలకు విశేషాలంకృతమైన దివ్యరథంపై రుక్మిణి, సత్యభామ సమేత శ్రీవేణుగోపాలస్వామివారు అధిష్టించారు. భక్తజన హర్షధ్వానాలు, బాజా భజంత్రీలు, కోలాటాల మధ్య పురవీధులలో ఊరేగుతూ దివ్యదర్శనమిచ్చారు. స్వామివారి రథోత్సవంలో పెద్దసంఖ్యలో భక్తులు పాల్గొని తరించారు. ఈ సందర్భంగా వర్గల్‌లో ఆధ్యాత్మికతలు వెల్లివిరిశాయి.


లక్షపుష్పార్చనలో మహిళలు

నాణ్యమైన విద్య అందించాలి

దుబ్బాకటౌన్: ప్రభుత్వ పాఠశాలకు విద్యార్థులకు నాణ్యమైన విద్యా బోధన చేయాలని జిల్లా సెక్టోరియల్ ఆఫీసర్ భాస్కర్ శ్రీరాజ్ అన్నారు. మంగళవారం రాయపోల్ మండలం బేగంపేట జిల్లా పరిషత్ ప్రాథమిక పాఠశాలను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వంట గదిని, మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ..పాఠశాలలో విద్యార్థులందరిపై ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. తరగతి గదిలో వెనుకబడి ఉన్న విద్యార్థులకు ప్రత్యేక కార్యాచరణ రూపొందించాలన్నారు. టీచర్స్ ఎప్పటికప్పుడు బోధనోపకరణాలను అందుబాటులో ఉంచుకోవాలన్నారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు అండాలు, ఉపాధ్యాయులు నవీన్ కుమార్, భాస్కర్, నరేందర్, సంజీవ్, నర్సింహులు గౌడ్, తదితరులున్నారు.


పాఠశాలలో వంట గదిని పరిశీలిస్తున్న భాస్కర్ శ్రీరాజ్

దేవాలయాలే టార్గెట్

- ఇద్దరు నిందితుల అరెస్టు
- బంగారు, వెండి ఆభరణాలు స్వాధీనం

చిన్నకోడూరు(సిద్దిపేట): దేవాలయాలే టార్గెట్‌గా చేసుకుని వరుస దొంగతనాలకు పాల్పడుతున్న ఇద్దరు నిందితులను మంగళవారం పోలీసులు అరెస్టు చేశారు. వారి వద్ద నుంచి బంగారు, వెండి ఆభరణాలు స్వాధీనం చేసుకున్నారు. సిద్దిపేట ఏసీపీ మధు ఈ కేసు వివరాలను విలేకరులకు వివరించారు. చిన్నకోడూరు ఎస్ఐ బాలకృష్ణ ఆధ్వర్యంలో సిబ్బంది మంగళవారం మండల పరిధిలోని రాముని పట్ల వద్ద వాహనాలు తనిఖీ చేస్తున్నారు. ఈ క్రమంలో కోహెడ మండలం బస్వాపూర్‌కు చెందిన బోదాసు యాదగిరి, దూల్మిట్ట మండలానికి చెందిన వల్లెపు శేఖర్ ద్విచక్రవాహనంపై ఇబ్రహీంనగర్ నుంచి సిద్దిపేట వైపు వెళ్తున్నారు. పోలీసులను చూసి పారిపోవడానికి ప్రయత్నించగా.. వారిని అదుపులోకి తీసుకుని విచారించారు. దేవాలయాల్లో పాల్పడిన దొంగతనాల గురించి వివరించారు. చిన్నకోడూరు, రాజగోపాల్‌పేట, సిద్దిపేట టూటౌన్, సిద్దిపేట త్రీటౌన్, కొహెడ, మద్దూరు, చేర్యాల, గజ్వేల్, హుస్నాబాద్ పోలీస్ స్టేషన్‌ల పరిధిలోని పలు గ్రామాల్లోని 20 గ్రామదేవతల ఆలయాల్లో చోరీలకు పాల్పడ్డారు. వారి వద్ద నుంచి 7.5 తులాల బంగారు ఆభరణాలు, 182 తులాల వెండి.. మొత్తం రూ. 7లక్షల విలువైన వస్తువులు రికవరీ చేశామని ఏసీపీ తెలిపారు. అలాగే రెండు ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నామని, ఇద్దరు నిందితులను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించామన్నారు. బస్వాపూర్‌కు చెందిన మరో నిందితుడు కొమిరే శ్రీనివాస్ పరారీలో ఉన్నట్లు తెలిపారు. సమావేశంలో రూరల్ సీఐ శ్రీను, ఎస్ఐలు బాలకృష్ణ తదితరులు ఉన్నారు.


నిందితుల వివరాలు వెల్లడిస్తున్న ఏసీపీ మధు

ఆర్మీ జవాను కన్నుమూత

రిమ్మనగూడలో విషాద ఛాయలు


జవాను శ్రీనివాస్(ఫైల్)

గజ్వేల్: సిద్దిపేట జిల్లా గజ్వేల్ మండలం రిమ్మనగూడకు చెందిన ఆర్మీ జవాను సోమవారం రాత్రి మహారాష్ట్రలోని పుణేలో మృతి చెందారు. గ్రామానికి చెందిన గుండారం శ్రీనివాస్(40) రెండు నెలల క్రితం వరకు జమ్ము కాశ్మీర్‌లో విధులు నిర్వహించారు. అక్కడ విధుల్లో ఉండగానే అనారోగ్యం బారిన పడ్డాడు. ఈ క్రమంలో పుణేలోని కమాండో ఆసుపత్రికి సంబంధిత అధికారులు రెఫర్ చేశారు. చికిత్స పొందుతున్న శ్రీనివాస్.. సోమవారం రాత్రి 10.30గంటల ప్రాంతంలో మృత్యువాతపడ్డాడు. విషయం తెలుసుకున్న ఆర్మీ అధికారులు.. పుణేలో గౌరవ లాంఛనాల అనంతరం మృతదేహాన్ని స్వస్థలం రిమ్మనగూడకు తీసుకొస్తున్నారు. మృతునికి భార్య కవిత, కుమారుడు భానుతేజ, కూతురు లాస్యప్రియ ఉన్నారు. శ్రీనివాస్ మరణవార్తతో రిమ్మనగూడలో విషాదఛాయలు అలుముకున్నాయి.


మృతుని భార్య కవితకు సంతాపం తెలుపుతున్న ఆర్మీ అధికారి

ఆహ్లాదం.. ఆమడదూరం..!

- అర్ధంతరంగా అర్బన్ పార్కు పనులు
- నాలుగేళ్ల క్రితం పనులు ప్రారంభం
- నిధులు లేక మధ్యలో నిలిపివేత
- పార్కు కల నెరవేరేనా..!


నారాయణఖేడ్: అసంపూర్తి దశలో ఎంట్రీప్లాజా పనులు

నారాయణఖేడ్: ప్రజలకు ఆరోగ్యం, ఆహ్లాదం పంచుతూ వాకింగ్ ట్రాక్‌గా మార్చాలన్న ఉద్దేశంతో పట్టణ శివారులో నిర్మించిన అర్బన్ పార్కు పనులు అర్ధంతరంగా నిలిచాయి. ఎంతో ఆర్భాటంగా పనులు ప్రారంభించి మధ్యలోనే నిలిపివేశారు. నారాయణఖేడ్ పట్టణానికి మూడు కిలోమీటర్ల దూరంలోని వెంకటాపూర్ శివారులోని అటవీశాఖ ప్రాంతాన్ని అర్బన్ పార్కుగా మార్చేందుకు నాలుగేళ్ల క్రితం అప్పటి ప్రభుత్వం నిర్ణయించింది. ఇందుకు రూ.1.80కోట్లు మంజూరు చేసింది. కొన్ని పనులు చేపట్టాక బిల్లుల చెల్లింపులు ప్రభుత్వం చెల్లించకపోవడంతో కాంట్రాక్టర్ పనులను నిలిపివేశాడు. దీంతో పట్టణవాసులకు అర్బన్ పార్కు ఆశలు కాస్త అడియాశలయ్యాయి.

జాతీయ రహదారి ఆనుకుని..

ఖేడ్ పరిధిలోని వెంకటాపూర్ నుంచి నర్సాపూర్ శివారు వరకు నాలుగు కిలో మీటర్ల మేర అర్బన్ పార్కుగా ఏర్పాటు చేయనున్న అటవీ ప్రాంతం నిజాంపేట– ఖేడ్– బీదర్ 161బీ జాతీయ రహదారి పక్కనే ఉంది. పనులు పూర్తి చేస్తే నారాయణఖేడ్ పట్టణంతోపాటు పరిసర గ్రామాల ప్రజలు వారాంతాలు, ఇతర సెలవు రోజుల్లో ఆహ్లాదకర వాతావరణంలో ఆనందంగా గడిపేందుకు అవకాశం ఉంటుంది. వాచ్‌టవర్ నుంచి ప్రకృతి అందాలను తిలకించవచ్చు. అర్బన్ పార్కు పూర్తి చేసే విషయంలో ఎమ్మెల్యే డాక్టర్ సంజీవరెడ్డి స్పందించాలని పట్టణవాసులు కోరుతున్నారు.

ఇవీ నిర్మాణాలు

నాటి సుమారు 450 ఎకరాల వరకు అటవీ ప్రాంతాన్ని అర్బన్ పార్కుగా మార్చాలని అప్పట్లో నిర్ణయించారు. ఇందుకోసం అడవి చుట్టూ ఫెన్సింగ్, నాలుగు కిలో మీటర్ల సైక్లింగ్ ట్రాక్, వాకింగ్ ట్రాక్‌ల నిర్మాణం, ఎంట్రీ ప్లాజా, వాచ్‌టవర్, గజబ్‌గదిని నిర్మించాలి. పిల్లల కోసం ఆట పరికరాలు ఆమర్చాలి. అడవిలోపల రోడ్డు నిర్మించాలి. వీటిలో ఎంట్రీ ప్లాజాను కొంత మేరకు నిర్మించి వదిలేశారు. వాకింగ్ ట్రాక్, వాచ్‌టవర్, గజబ్‌గది తదితర పనులు ఇప్పటికీ ఆరంభించలేదు. సకాలంలో బిల్లులు ఇవ్వడం లేదని కాంట్రాక్టర్ పనులు నిలిపివేశారని అధికారులు చెబుతున్నారు. కాగా చేపట్టిన పనుల్లో నాణ్యత లోపించిందన్న ఆరోపణలు సైతం ఉన్నాయి. సిమెంట్ నిర్మాణాల్లో నాణ్యత లోపించడంతో అప్పుడే దెబ్బతింటున్నాయని పలువురు పేర్కొంటున్నారు.

పనులు త్వరగా పూర్తి చేయాలి



అర్బన్ పార్కు పనులు త్వరగా పూర్తి చేయాలి. పార్కు పనులు అసంపూర్తిగా నిలిచాయి. సైక్లింగ్, వాకింగ్ ట్రాక్‌ల నిర్మాణం పూర్తయితే ప్రజలకు ఎంతో ఉపయుక్తంగా ఉంటుంది. పట్టణ వాసులతోపాటు, చుట్టు పక్కల గ్రామాల వారికి అనుకూలంగా ఉంటుంది.

– పండరి, లింగాపూర్

నిర్మాణం చేపట్టాలి



పట్టణ శివారులో నిర్మిస్తూ అర్ధంతరంగా ఆపివేసిన అర్బన్ పార్కు పనులు తిరిగి చేపట్టాలి. పనులు మొదట్లో చురుగ్గా సాగిని మధ్యలో ఆపివేశారు. నాలుగేళ్లుగా పనులు ఆగాయి. అర్బన్ పార్కు పూర్తయితే పట్టణ వాసులకు ఎంతో అనుకూలంగా ఉంటుంది.

– శశిధర్‌రెడ్డి, నారాయణఖేడ్